# ఆనందో బ్రహ్మ!

పైరవీ చేయించలేదు. లంచం ఇవ్వలేదు. కేవలం మెరిట్ మీదే జాబ్ సంపాదించాడు సదానందం! జీతం నెలకు లక్షపైమాటే! అదీ ఇంటర్నేషనల్ కంపెనీలో! కారు... బంగళా... హోదా అన్నీ వున్నయ్.

ఓ చెట్టు కింద ప్లీడర్ దగ్గర మతిలేని గుమాస్తా వుద్యోగం తండ్రిది! వానాకాలం చదువుకావటాన ప్లీడరు గుమాస్తానే గొప్పనుకుని తృప్తి పడాల్సి వచ్చింది నారాయణ!

టెన్త్ స్టేట్ ఫస్ట్ వచ్చినా కొడుకుని కాలేజీలో చేర్పించేస్తోమత తనకు లేదని కాళ్లుబార చాపినా సందానందం అదృష్టవంతుడు కావటాన మెరిట్ స్కాలర్ షిప్‌తో పి.జి చేసి ఎం.బి.ఏ ఫినిష్ చేసి కాలర్ ఎగరేశాడు.

సదానందానికి ఎప్పుడైతే మంచి వుద్యోగం దానితో పాటు హోదా వచ్చాయో... నారాయణ ఇంట్లో పెళ్లికి మగపిల్లాడువున్నాడనే విషయం దేశమంతా తెల్సింది!

ఆడపిల్లల తండ్రులు నారాయణ ఇంటిముందు కొత్త సినిమా రిలీజ్ అయిన నాడు ప్రేక్షక జనం మూగినట్టు... ఇంటి ముందు క్యూకట్టారు. డౌరీ రేటు పెరుగుతూ వచ్చింది. వేలంపాట రేటు పెరిగనట్టు... అరకోటి... కోటి... ఇస్తామంటూ బ్లాక్‌మనీ హోల్డర్స్ తమ పిల్లలను చేసుకోమంటూ చేతులు కట్టుకు నిలబడ్డారు.

పెళ్లి విషయంలో మాత్రం సదానందం జోక్యం చేసుకో తల్చుకోలేదు. పేరేంట్స్ నిర్ణయానికే వదిలి పెట్టాడు. కాకపోతే తనకు పిల్ల నచ్చాలంతే!

బైటివారి పోరు పడలేక అయిన సంబంధం కలుపుకుంటే అన్ని విధాలా మంచిదన్పించి బందువర్గంలో ప్రచారం మొదలుపెట్టారు. పిల్ల నచ్చితే... కట్నం నచ్చక... ఈరెండూ నచ్చితే పిల్ల చదువు నచ్చకపోవటంతో నారాయణ దంపతులు ఒక నిర్ణయానికి రాలేకపోతూండటం గమనించిన సదానందం పరాయి సంబంధాలే తప్పదన్పించి పేరేంట్స్‌కి గ్రీన్‌సిగ్నలిచ్చాడు.

సదానందం స్వతహాగ మిత భాషి! తన పనేదోతాను చూసుకుంటూంటాడు. ఇతర విషయాల్లో జోక్యం చేసుకోడు. పోచికోలు కబుర్లకు ఆమడ దూరం! మనిషి ఎల్లవేళలా సీరియస్‌గా వుంటాడు. నవ్వనేది అతని పెదాలపై చూద్దామన్నా

కన్పించదు. అన్నీ పుట్టుకతో వచ్చిన లక్షణాలే!

ఇలా వుంటే రేపు పెళ్లాంతో సవ్యంగ కాపురం ఎలా చేస్తాడోని పేరెంట్స్ దిగులు! సినీమాకెళ్లినా... ఇంట్లో టి.వి.చూస్తున్నా... కామెడీ సన్నివేశాలు వచ్చినప్పుడైనా అందరూ పొట్టచెక్కలయ్యేట్టు నవ్వుతున్నా సదానందంలో మాత్రం ఎలాంటి చలనం వుండకపోవటం విశేషం!

కాస్త నవ్వరా తండ్రీ!... లేకపోతే... నీపెళ్లాం వచ్చాక నిన్నేడిపిస్తుంది.... అని తల్లి కామెంట్ చేసినా పట్టించుకోడు. ఎవరెన్ని అన్నా చెవినేసుకోడు! వట్టి మొండి ఘటం!

పెళ్లి చూపులకు వెళ్లినప్పుడల్లా చలనం లేని రాతి బొమ్మలా వుండకురా... కాస్తంత నవ్వు ముఖానికి పులుముకుని అమ్మాయి వైపు నవ్వుతూ ఓ లుక్ ఇవ్వరా నా పిచ్చికన్నా.... అని తండ్రి అన్నా... కనీసం తలైనా ఆడించడు.

ఎట్టకేలకు ఓగడుసు సుందరాంగి మెడలో మూడు ముళ్లువేసి... నెత్తిన జీలకర్ర బెల్లం పెట్టి... తలంబ్రాలు పోశాడు సదానందం.

పెళ్లి కూతురు ప్రభావతి కూడా పి.జీ చేసింది. వెల్ ఎడ్యుకేటెడ్!. ప్రభావతిలో తెలుగు సినిమాల ఇనూఫ్లుయన్స్ జాస్తి అయిన కారణంగా మాటల్లో కాస్తంత వెటకారం పాలు ఎక్కువ! సెటైర్లు వేయటంలో దిట్ట! వఠివాగుడు కాయ. నేటితరం ఆడపిల్లకే మాత్రం తీసిపోదు.

పెళ్లిచూపుల నాడు ఫుల్ సూట్లో ఉన్న సదానందాన్ని చూసి ఓకే చేసింది. అతని స్టైల్... కర్లీ హెయిర్... పర్సనాలిటీ.. మీసకట్టు... బంగారం లాంటి శరీర ఛాయ చూచి 'డంగై'... కొద్ది క్షణాలు కళ్లార్పకుండా అతనివైపే చూస్తూండిపోయింది..

పెళ్లి చూపులప్పుడే సదానందాన్ని చూచి ఎవ్వరూ చూడని సమయంలో కన్నుగీటి అతడిని కలవరపాటుకు గురిచేసింది. వామ్మో!... ఇది సామాన్యురాలు కాదు అనుకున్నాడు సదానందం.

మొత్తానికి ప్రభావతి సదానందాన్ని బొక్కబోర్ల పడేసింది. మనసుకు గేలం వేసింది! తాను ఇంత చేస్తున్న సదానందంలో వీసమంతైనా చలనం లేకపోవటం చూస్తూ అతనికి నత్తి ఏమైనా వుందా? ఎందుకని పెదవివిప్పడు? ఇదొక స్టైల్ కాబోలు అని మనసుకు సర్ది చెప్పుకుంది.

పెళ్లి పందిట్లో బాజాలు మోగుతున్నయ్! పీటల మీద కూర్చున్న క్షణం

నుండి సదానందాన్ని ఓకంట కన్నెడుతూనే వుంది. అప్పుడప్పుడు ఎవరూ గమనించని సమయంలో మోచేత్తో పొడిచింది. పెళ్లికొడుకులో హుషారు లేకపోవటం గమనించి కంగుతిన్నది ప్రభావతి.

సరే... నీ సంగతి ఇప్పుడు కాదు... నివ్విలాగే వున్నావంటే శోభనం రాత్రి నీ భరతం పట్టకపోను అనుకుంది మనసులో!

నీళ్ల బిందెలో ఉంగరం... మట్టెలు వేసి వాటిని తియ్యమన్నప్పుడు... వధూవరులిద్దరూ ఒకే సమయంలో తమ చేతులను బిందెలోకి జొప్పించినా... సదానం.. తన భార్య చేతులను తన మునివేళ్లతో(గోళ్లతో) గిల్లటం వంటి చర్యలేమీ లేకపోవటం వల్ల ప్రభావతి డిజపాయింట్‌మెంట్‌కు గురైంది.

గృహప్రవేశ సమయంలోనూ... సింహ ద్వారం వద్ద ఆడవాళ్లు గుమిగూడి పేర్లు చెప్తేగాని లోపలికి పోనిచ్చేది లేదనప్పుడూ సదానందం సైలెంటే! ఇంకా నయం పేర్లేచెప్పమన్నారు.... పుట్టినతేది... క్వాలిఫికేషను... నెలకొచ్చే జీతం కూడా చెప్పమన్లేదు అనేసి గొణుకున్నాడు మనసులో సదానందం.

పాపం ప్రభావతికి అడుగడుగునా నిరుత్సాహమే!

ఆరాత్రికే శోభనం!

ఇదెంతల క్షణంగా వుంటుందో మాటాపలుకు లేని 'ముంగి' మొగుడితో అనుకుని నిరుత్సాహానికి గురైంది ప్రభావతి.

సదానందం అందంగా అలంకరించిన డబుల్ బెడ్‌మీద కూర్చుని ఏదో బుక్ చదవటంలో లీనమైనాడు. ఇంతలో ప్రభావతి ఎంట్రీ ఇచ్చింది. ఎంత చదువుకుని పాతికేళ్లు దాటేక పెళ్లి చేసుకున్నా స్వభావ సిద్ధంగ ఆమెలో గల ఆడతనం రెట్టింపై తలదించుకుని సిగ్గుపడి పోతూ మూసేయబడిన తలుపు దగ్గరే నిల్చుంది భర్త వచ్చి తనను మంచం దాకా నడిపించుకుంటూ తీసుకు పోతాడనుకున్న ప్రభావతి ఆలోచన కేవలం ఊహ మాత్రమే అన్పించింది.

మంచం మీద నుండి సదానంద ఎంతకీ కదలకపోవటం గమనించిన ప్రభావతి నిరుత్సాహన్ని దూరం చేసుకుని జూలు విదిలించుకున్న సింహంలా తనే ఒంటరిగా ఏమండీ... నేనొచ్చేశా... అంటూ మంచాన్ని సమీపించాలనుకున్నదల్లా సైలెంట్‌గా భర్తను సమీపించింది.

పుస్తక పఠనంలో లీనమైన సదానందం కనీసం తలైనా తిప్పలేదు... భార్య

రాక గమనించలేదు.

ఇక లాభం లేదని... అక్కడున్న పాలగ్లాసు తెచ్చి భర్త పెదాలకు తాకిస్తూ 'పాలు తాగండి' అంది.

'అమ్మో పాలే?... నో నో నో పాలు అంటే నాకు ఎలర్జీ! నేనెప్పుడూ పాలు తాగి ఎరగను. పసితనంలో మమ్మీ కూడా నాకు పాలిచ్చేది కాదు. డబ్బా పాలే అలవాటు చేసింది తెలుసా?-'

'నాకెట్లా తెలుస్తుంది? ఇప్పుడే కదా మీరు చెప్పగా నేను విని తెల్సుకుంది...' వచ్చే నవ్వు ఆపుకో ప్రయత్నిస్తూ అంది.

'పోనీ.. ఈ స్వీట్ అయినా తీసుకోండి' జాంగ్రీ అందించబోయింది

బల్లి మీద పడిన వాడిలా బెదిరిపోతూ 'స్వీటా? అసలొద్దు...' చెప్పాడు.

'ఏం? ఎందుకని? మీకు షుగరుందా...?'

ఆమాటకు సదానందం కంగుతిన్నాడు.

ఎట్టకేలకు సైలెన్స్ బ్రేక్ అయినందుకు సగం సంతోషించింది ప్రభావతి.

తెల్లారకముందే మేల్కొని తలారా స్నానం చేసి నీరెండలో జుట్టు ఆరబెట్టుకోవటం అత్తగారు గమనించి కోడలికి దగ్గరై 'కోడలా కళ్లు ఎర్రగా వున్నయ్... తెల్లార్లూ నిద్ర లేదా ఏం?...' కొంటె ప్రశ్నవేసింది.

ప్రభావతికి వళ్లు మండటంతో 'షాంపూ కంట్లోకి పోయింది అంతే...' ప్రభావతి సమాధానంలో బాధ అసంతృప్తి ద్యోతకమైనయ్.

అదేంటి? అంది అత్తగారు.

అంతసీన్ లేదులెండి! మీ అబ్బాయి అపరకుంభ కర్ణుడు. మంచం వాసన చూడగానే గుర్రుపట్టి నిద్రపోయాడు... అందామనుకుంది కాని నోరు పెగల్లేదు.

'నాకొడుకు పెద్ద చదువు చదివి... పెద్ద వుద్యోగం చేస్తున్నాడన్న మాటే గాని... వట్టి నోరులేని వాడమ్మా!... నువ్వే అన్నీ చూచుకోవాలి కోడలా...' అనేసి కిచన్లోకి దూరింది అత్తగారు.

మేడమీదికెళ్లగానే సెల్ రింగ్‌టోన్ విన్పించటంతో దాన్ని అందుకున్న ప్రభావతి స్విచ్ ఆన్ చేసింది.

'నేను ప్రభా... నీతోడి కోడలు స్వప్న మాట్లాడుతున్నా వైజాగ్ నుంచి...'

'నువ్వా... ఏమిటి ఇంత ఎర్లీగా ఫోన్ చేశావ్?-'

'నీ ఫస్ట్‌నైట్ విశేషాలు చెప్పవే... వింటాను! గిచ్చుళ్లతో కొరుకుళ్లతో నీ మొగుడు నిన్ను ప్రాణం తీశాడా? నీ నడుము విరగ్గొట్టి తెల్లవార్లూ నిద్ర లేకుండా చేశాడా?.. నిన్ను పీకి పాకం పెట్టాడా?...' అవతలివైపు నుంచి తోడి కోడలు ప్రశ్నల వర్షం కురిపించింది.

'షటప్! అతిగా వాగకు! నువ్వు వూహించినట్టులేనే లేదు. డిజపాయింట్‌మెంటే మిగిలింది- చెప్పటానికి సిగ్గుగా వుంది'

'అదేంటి?-?'

'ఏం చేయను? ఆయనోబుద్ధావతారం! ఆయనకు ఆడభయం ఎక్కువనుకుంటాను...'

'డోన్ట్ వర్రీ! అందరూ నీలా 'ఫాస్ట్'గా వుండకపోవచ్చు. ఈరోజు సెకండ్ నైట్ కదా? కొత్త తీరి నిన్ను కొరుక్కుతింటాడ్లే!- స్లో అండ్ స్టడీ విన్ ది రేస్! బెదరగొట్టకు! మంచిగ మచ్చిక చేసుకో... అప్పుడంతా హేపీసే! నో వర్రీస్...'

'లెట్‌మీ హోప్‌సో!- వివరాలు రేపు చెప్తా...' మొబైల్‌స్విచ్ ఆఫ్ చేసింది ప్రభావతి.

రాత్రికి ఇద్దరూ ఒకటైనారు.

'ఇదిగో... చక్కిలి గిలిపెట్టకు... నవ్వు ఆపుకో లేకపోతున్నాను...' మెలికలు తిరిగిపోతూ వేడుకున్నాడు పెళ్లాన్ని సదానందం.

అట్లాదారికి రారా మగడాని మనసులోనే అనుకున్న ప్రభావతి 'సారీ డియర్... ఐయామ్‌వెరి వెరీ సారీ...' అంది.

భార్యా భర్త మధ్య 'సారీ'లుండవ్. అన్నీ తియ తీయని అనుభూతుల స్టోరీలే అంటూ ప్రభావతిని ఆక్రమించుకున్నాడు.

ఇంకేముంది? నైటంతా... అల్లరి ప్లస్ ఆనందం! ఆనందో బ్రహ్మ!!

(సమాప్తం)